సాక్షి ఖమ్మం

శనివారం । 29 । మార్చి । 2025



ఎల్ఆర్ఎస్.. తిప్పలు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాయితీతో ఫీజు చెల్లించే గడువు సమీపిస్తుండగా సాంకేతిక సమస్యలు వారిని వేధిస్తున్నాయి. 11లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం సా॥) 6.28

సహర్ (ఆదివారం ఉ॥) 4.48

వాతావరణం

గరిష్టం / కనిష్టం 40° / 21°

జిల్లాలో శనివారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

రైల్వేలైన్ల అలైన్‌మెంట్ మార్చండి



చైర్మన్‌తో చర్చిస్తున్న ఎంపీ

ఖమ్మంవన్‌టౌన్: డోర్నకల్–మిర్యాలగూడ, డోర్నకల్–గద్వాల రైల్వేలైన్ల అలైన్‌మెంట్ మార్చాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురాంరెడ్డి కోరారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన ఢిల్లీలో రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్‌ను కలిశారు. ప్రతిపాదిత అలైన్‌మెంట్ జరిగే నష్టం, చేయాల్సిన మార్పులను వివరించారు. ఈ అంశాలపై బోర్డు చైర్మన్ సానుకూలంగా స్పందించి, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారని ఎంపీ ఓ ప్రకటనలో వెల్లడించారు.

'యువ వికాసం'కు 5లోగా దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: రాజీవ్ యువవికాసం పథకానికి షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువత వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల్లోని నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలతో ఆర్థిక పురోగతి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని వెల్లడించారు. ఈమేరకు ఆసక్తి ఉన్న ఎస్సీ నిరుద్యోగ యువత https://tgobmmsnew.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని దరఖాస్తు ప్రతికి అవసరమైన పత్రాలు జతపరిచి గ్రామీణ ప్రాంతాల వారైతే మండల ప్రజాపాలన సేవా కేంద్రాల్లో, పట్టణ ప్రాంతాల అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

మైనార్టీ అభ్యర్థులు...

ఖమ్మంమయూరిసెంటర్: రాజీవ్ యువ వికాసం పథకం కోసం ముస్లిం, క్రైస్తవ, సిక్, బౌద్ధులు, జైనులు, పార్సీలకు చెందిన మైనారిటీ నిరుద్యోగ యువత వచ్చేనెల 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ బి.పురంధర్ ఒక ప్రకటనలో సూచించారు. పూర్తి వివరాల కోసం 97040 03002లో సంప్రదించాలని తెలిపారు.

31లోగా జీఎస్టీ చెల్లిస్తే జరిమానా, వడ్డీ మాఫీ

2017 నుంచి 2020 వరకు బకాయిలకు వర్తింపు

ఖమ్మంగాంధీచౌక్: జీఎస్టీ(వస్తు సేవా పన్ను) ప్రారంభమైన తొలి మూడేళ్లకు సంబంధించి విధించిన జరిమానా, వడ్డీ రాయితీకి మినహాయింపు ఇస్తూ సంస్థ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీఎస్టీ ఏర్పాటైన తొలి మూడేళ్లలో సాంకేతిక కారణాలతో పన్నుల్లో వ్యత్యాసాలు చోటు చేసుకున్నాయి. దీన్ని సవరించాలని చెల్లింపుదారులు విజ్ఞప్తి చేయగా జరిమానా, వడ్డీ మినహాయింపునిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు 2017 నుంచి 2020 వరకు నిర్దేశిత పన్నులను ఈనెల 31లోగా చెల్లిస్తే జరిమానా, వడ్డీ మాఫీ చేస్తామని, అప్పీలేట్ అథారిటీ లేదా కోర్టును ఆశ్రయించిన వారికి సైతం ఈ ఉత్తర్వులు వర్తిసాయంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అవకాశాన్ని చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ జీఎస్టీ, కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాష్, స్టేట్ జీఎస్టీ కమిషనర్ హరిత ఓ ప్రకటనలో సూచించారు.

మాడ వీధుల విస్తరణకు లైన్ క్లియర్

నిర్వాసితులకు చెక్కుల పంపిణీ



చెక్కుల పంపిణీ చేశాక నిర్వాసితులతో ఆర్డీఓ దామోదర్ రావు తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి మార్గం సుగమమైంది. విస్తరణ పనులకు అధికారులు రెండెకరాల స్థలం సేకరించారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి తొలి విడతగా రూ. 60 కోట్లను ప్రకటించి, రూ. 35 కోట్లు విడుదల చేశారు. దీంతో భూ, ఇళ్ల నిర్వాసితులకు శుక్రవారం నష్టపరిహారం అందజేశారు. ఆర్డీఓ దామోదర్‌రావు తన కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. 17 కుటుంబాలకు రూ. 10.82 కోట్లను అందించారు. మిగతావారికి శనివారం చెక్కులు ఇస్తామని, మొత్తంగా 40 కుటుంబాలకు రూ.34.45 కోట్లు అందజేయాల్సి ఉందని వెల్లడించారు. కాగా ఏప్రిల్ 6న ఆలయ అభివృద్ధి, మాడ వీధుల విస్తరణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసే అవకాశం ఉంది.

పేదరికమే అర్హత

ఇందిరమ్మ లబ్ధిదారులకు రుణాలు.. అవసరమైతే అద్దె కూడా..



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'జిల్లాలో పైలట్‌గా గుర్తించిన 21 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని జనవరి 26న ప్రారంభించాం. ఆయా గ్రామాల్లో 850 మంది లబ్ధిదారుల ఇళ్లు గ్రౌండింగ్ చేస్తుండగా, మున్సిపాలిటీలు, మిగతా గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక జరుగుతోంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కారమయ్యేలా ప్రచారం చేస్తున్నాం. ధాన్యం కొనుగోళ్లు, రేషన్‌షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరాకు సిద్ధమయ్యాం. వేసవిలో తాగునీటి సరఫరాలో అవాంతరాలు ఎదురుకాకుండా ప్రణాళికలు రూపొందించాం' అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై శుక్రవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు వివరాలు వెల్లడించారు. ఏ పథకం అమలు చేసినా అంతిమంగా పేదరికమే అర్హతగా లబ్ధిదారుల గుర్తింపు ఉంటుందని కలెక్టర్ పేర్కొనగా, ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

- ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- రేషన్ దుకాణాల ద్వారా పంపిణీకి సన్న బియ్యం రెడీ
- వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ప్రణాళిక
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పాత లబ్ధిదారులకూ అవకాశం..

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గతంలో సగం నిర్మించి, బేస్‌మెంట్ అయినవి ఉన్నాయి. 800మంది వరకు ఉండగా.. వీరికి ఈసారి పథకం వర్తింపజేయవచ్చా, చేస్తే నగదు మంజూరవుతుందా లేదా అని పరిశీలించి అమలుకు కృషి చేస్తాం. ఏప్రిల్ మొదటి వారంలోగా ఇది పూర్తిచేసేలా 18 గ్రామాలకు ఇప్పటికే పరిశీలించాం. తాపీ మేస్త్రీలకు శిక్షణ పూర్తికాగా, రూ.5లక్షల్లోనే నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రతీ సోమవారం మోడల్ హౌస్‌కు వద్దకు తీసుకెళ్లాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించాం.

ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం

ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి 92వేల దరఖాస్తుల్లో మూడు నెలల కింద 10వేలు, ప్రస్తుతం 36వేల దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. కానీ 3వేల మందే ఫీజు చెల్లించారు. ప్రస్తుతం స్పందన పెరుగుతోంది. ఎల్ఆర్ఎస్ వల్ల లాభాలను స్థల యజమానులకు వివరిస్తున్నాం.

జల్లెడ పట్టాకే బస్తాల్లోకి ధాన్యం

ధాన్యం కొనుగోలు కేంద్రాలు జిల్లాలో 345 ఏర్పాటు చేస్తుండగా.. గతంలో ఐకేపీ ద్వారా 60 ఉంటే 147కు పెంచాం. ఈసారి 200కు చేరుస్తుండడంతో మహిళా సంఘాల సభ్యులకు కమీషన్ వస్తుంది. ఏ ప్రాంత రైతులు అక్కడే ధాన్యం అమ్ముకునేలా పరిశీలించాలని అధికారులకు సూచించాం. రైతు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఏఈఓ పరిశీలించాక సాగు విస్తీర్ణం, దిగుబడి అంశాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. జల్లెడ పట్టాకే బస్తాల్లో నింపాలని చెబుతుండడంతో మిల్లర్లు ఒక్క కిలో కూడా కోత విధించే అవకాశం ఉండదు. కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తే నగదు చెల్లింపుల్లో వేగం పెరుగుతుందని సూచించాం.

సమృద్ధిగా తాగునీరు

ఈ వేసవిలో తాగునీటి సరఫరాలలో ఇబ్బంది రాకుండా మూడు నెలల క్రితమే ప్రణాళిక సిద్ధం చేశాం. గత ఏడాది ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో కొరత ఎదురైనా ఈసారి పాలేరులో సరిపోయేంత నీటి నిల్వలు కొనసాగిస్తున్నాం. ఐదు రోజుల క్రితం ఈ అంశంపై చర్చించాం. గతంలో ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల దగ్గర నాలుగైదు గ్రామాలకు ఇబ్బంది వచ్చింది. కట్టలేరు వద్ద మరమ్మతుల సమయంలో పైపులైన్లు దెబ్బతిన్నాయి. ఈసారి అలా జరగకుండా చూస్తున్నాం. ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉంటే ట్యాంకర్లు సమకూర్చుకోవాలని సిబ్బందికి సూచించాం.

సరిపడా సన్నబియ్యం

జిల్లాలో సన్న బియ్యం నిల్వలు సరిపడా ఉన్నాయి. అంతకుముందు లక్ష మెట్రిక్ టన్నులు ఉంటే.. పోయిన సీజన్‌లో 2లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించాం. ఇందులో 1.7 లక్షల మెట్రిక్ టన్నులు సన్న బియ్యమే. ఈసారి కూడా 80 శాతం సన్న బియ్యం వస్తాయి. దీంతో వచ్చేనెల 1నుంచి రేషన్ షాప్‌ల ద్వారా సన్న బియ్యం పంపిణీకి అవాంతరాలు ఎదురుకావు.

అద్దె కట్టలేకపోతే మేం కడతాం..

తొలిదశగా 21 జీపీల్లో 850 మంది ఇందిరమ్మ లబ్ధిదారులు ఉండగా.. 500కు పైగా ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయి. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయితే రూ.లక్ష బిల్లు అందుతుంది. కానీ సరిపడా నగదు లేక 367 మంది ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించాం. వీరిలో 290 మందికి మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష చొప్పున రుణం ఇప్పించాం. ఇక ఒంటరి మహిళలు ఉన్న జాగాలోనే ఇల్లు కట్టుకోవాల్సి ఉండడం.. అందుకోసం ప్రస్తుత నివాసాన్ని కూల్చి రావడంతో అదే గ్రామంలో అద్దెకు ఉండాలని చెబుతున్నాం. అద్దె కట్టుకోలేని స్థితి ఉంటే మేమే కడతాం. ఇక ఇంటి నిర్మాణ పనుల పర్యవేక్షణను కార్యదర్శికి అప్పగిస్తాం.

ఆలంబనే అండగా అద్భుతం

- ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు పదిరోజుల శిక్షణ
- పెట్రోల్ వాహనాన్ని ఎలక్ట్రిక్‌గా మార్చడం, సర్వీసింగ్‌లో నైపుణ్యం
- ప్రైవేట్ సంస్థ సహకారంతో ప్రతిభ



ఎలక్ట్రిక్ వాహనం సర్వీసింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



ఎలక్ట్రిక్ వాహనంగా మార్చాక స్కూటీ

ఖమ్మం సహకారనగర్: ఆలోచనలు బాగుంటే ఆవిష్కరణలు మరింత అద్భుతంగా వస్తాయి. కాస్త సహకారం తోడైతే చాలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు సైతం సత్తా చాటుతారని మరోసారి నిరూపితమైంది. ఖమ్మం టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐలో కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ సంస్థ, సెంటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్(సీఎస్‌డీ) కలిపి 'ఎలక్ట్రికల్ వెహికిల్ సర్వీస్ టెక్నీషియన్' అంశంపై పది రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. నలభై మంది శిక్షణ పొందగా.. వారి ఆలోచనతో పెట్రోల్‌తో నడిచే ద్విచక్ర వాహనాన్ని ఎలక్ట్రిక్ వాహనంగా మార్చడం విశేషం.

శిక్షణ ఇలా

డాక్టర్ రెడ్డీస్ సంస్థ సెంటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్(సీఎస్‌డీ) సంస్థ నేతృత్వాన ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అనుమతితో ఈ శిక్షణ మొదలైంది. ఈమేరకు శిక్షణకు కావాల్సిన వాహనం, టూల్స్, పరికరాలను సమకూర్చి తరగతి గదులను కేటాయించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 10వ తరగతి చదవడమే కాక ఐటీఐ ఉత్తీర్ణులైన 40మంది నిరుపేదలను గుర్తించారు. వీరికి మధ్యాహ్న భోజనం, వసతి సదుపాయంతో శిక్షణ ఇవ్వగా... పెట్రోల్‌తో నడిచే స్కూటీని ఎలక్ట్రికల్ స్కూటీగా మార్చడం విశేషం. టెస్ట్ డ్రైవ్‌లోనూ విజయవంతమైందని వెల్లడించారు. ఇక శిక్షణ అనంతరం చివరి రోజు అభ్యర్థులకు పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. తద్వారా భవిష్యత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు పెరగనున్నందున టెక్నీషియన్లుగా వీరికి ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

ఆసక్తి ఉన్న వారికి ప్రోత్సాహం



యువత జీవితంలో స్థిరపడేలా శిక్షణ ఇచ్చేందుకు డాక్టర్ రెడ్డీస్ సంస్థ బాధ్యులు సంప్రదించారు. దీంతో వారికి సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులు తమ ఆలోచనతో పెట్రోల్ వాహనాన్ని ఎలక్ట్రిక్ వాహనంగా మార్చేలా ప్రయత్నం చేసి సాధించారు.
– ఎ.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ

థియరీ, ప్రాక్టికల్స్ కూడా...



ఐటీఐలో పది రోజుల పాటు ఇచ్చిన శిక్షణతో ఎన్నో విషయాలు తెలిశాయి. థియరీనే కాక ప్రాక్టికల్ స్కిల్స్ నేర్పించారు. దీంతో పెట్రోల్ స్కూటీని ఎలక్ట్రిక్ స్కూటీగా మార్చేలా శిక్షణ ఇచ్చిన సంస్థకు, సహకరించిన ప్రిన్సిపాల్‌కు కృతజ్ఞతలు.
– అక్షిత్

మంచి నైపుణ్యాలు..



మాకు మధ్యాహ్న భోజనం, వసతి కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణతో ఎలక్ట్రికల్ వెహికిల్ టెక్నీషియన్‌గా ఉపాధి పొందే అవకాశం లభించనుంది. అందుకు కావాల్సిన మంచి నైపుణ్యాలను మాకు ప్రాక్టికల్‌గా సంపూర్ణంగా నేర్పించారు. – ప్రకాష్

చాలా విషయాలు నేర్చుకున్నాం..



పది రోజులశిక్షణలో ఎలక్ట్రిక్ వాహనం సర్వీసింగ్‌తో పాటు పెట్రోల్ స్కూటీని మార్చడంపై శిక్షణ ఇచ్చారు. చివరిరోజు పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్ కూడా అందదజేశారు. ఇందుకు డాక్టర్ రెడ్డీస్ సంస్థ, ప్రిన్సిపాల్, సిబ్బందికి కృతజ్ఞతలు. – మణితేజ

హామీలు అమలుచేయకపోతే మంత్రుల ఇళ్లు ముట్టడి



దీక్షలో పాల్గొన్న ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయని పక్షంలో మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి హెచ్చరించారు. రైతాంగం సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యాన నిర్వహించిన 'రైతు సత్యాగ్రహ దీక్ష'లో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు చెప్పినట్లుగా రుణమాఫీ సంపూర్ణంగా అమలుచేయకపోవడంతో రైతులు నష్టపోయారని తెలిపారు. అంతేకాక పెట్టుబడి సాయం, ధాన్యం కొనుగోళ్లలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇక ధరణి పోర్టల్ సమస్యలపైనా స్పందించడం లేదన్నారు. ఈ దీక్షలో బీజేపీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు నాయకులు నున్నా రవికుమార్, శ్యామ్ రాథోడ్, చావా కిరణ్, చిలుకూరి రమేష్, ఏనుగుల వెంకటరెడ్డి, సీతారాంనాయక్, చిందల శ్రీనివాసరావు, జంపన్న సీతారామరాజు, ఓలా రాజు, బిక్షపతి, బాలు నాయక్, శ్రీనివాసరెడ్డి, పసుమర్తి సతీష్, భూక్య వెంకన్న, ఎల్లారావు గౌడ్, నరికుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మీ 'ప్రస్థానం' వివరించండి...

- రిటైర్డ్ అయిన, కానున్న ఉద్యోగులతో కలెక్టర్ ముఖాముఖి
- ప్రస్తుత ఉద్యోగులకు సూచనలు ఇచ్చేలా ప్రత్యేక కార్యక్రమం



రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మణ్‌రావు అనుభవాలను తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



రిటైర్ కానున్న ఉద్యోగి బాలాజీని సన్మానిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: నిత్యం అధికారులు, సిబ్బందితో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో ఖమ్మం కలెక్టరేట్ సందడిగా ఉంటుంది. కానీ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం వివిధ శాఖల ఉద్యోగులంతా చేరారు. ప్రతీనెలా మాదిరిగానే ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగులు, వారి కుటుంబాలతో సహా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సన్మానిస్తారనే సమాచారం ఇవ్వగా వారంతా వచ్చారు. కానీ ఎప్పటిలా కాకుండా ఈసారి వినూత్నంగా 'ప్రస్థానం' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించిన కలెక్టర్.. రిటైర్డ్ ఉద్యోగులతో ముఖాముఖిగా మాట్లాడారు. వారి ఉద్యోగ ప్రస్థానం, ఎక్కడెక్కడ పనిచేశారు.. విధినిర్వహణలో ఎదురైన అంశాలను ఆరాతీస్తూ ప్రస్తుత ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈమేరకు సమావేశ మందిరంలో ఉద్యోగిని కూర్చోబెట్టి ఎదురుగా కలెక్టర్ కూర్చుని ఇంటర్వ్యూ మాదిరి కొనసాగించారు. తొలుత గత నెలలో రిటైర్ అయి కలెక్టరేట్‌లో ఔట్‌సోర్సింగ్‌పై విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మణ్‌రావుతో ఆయన మాట్లాడారు. ఉద్యోగంలో చేరిన సమయాన పరిస్థితులు, ఇప్పుడు ఎలా ఉన్నాయి, ఉమ్మడి జిల్లాగా భద్రాచలం వరదల సమయాన ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఆరా తీస్తూ వారి అనుభవాలు, నాడు – నేడు కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు.

రిటైర్‌కానున్నది వీరే..

ఈనెల 31న జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు ఆరుగురు రిటైర్ కానున్నారు. ఇందులో ఎం.మల్లికార్జునరావు(ఫార్మసిస్ట్, కొణిజర్ల), డి.బాలాజీ (సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్), ఎం.బాలహేమలత(ఆర్అండ్‌బీ ఈఈ), పి.రామకృష్ణ (తిరుమలాయపాలెం తహసీల్దార్), ఎస్.సత్యవతి (డీఆర్‌డీఓ ఈఓ), సీహెచ్.రాధ(ఖమ్మం ఎస్సీ బాలికల హాస్టల్ కుక్) ఉన్నారు. వీరిని కుటుంబీకులతో సహా కలెక్టర్ సన్మానించారు. అలాగే, ఉద్యోగం రాక ముందు ఏం చేశారు, ఉద్యోగం ఎలా వచ్చింది.. ఎక్కడెక్క పనిచేశారు.. ఆ సమయంలో ఘనతలను తెలుసుకున్న ఆయన ప్రస్తుత ఉద్యోగులకు అవసరమైన సూచనలు ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, డీఆర్వో ఏ.పద్మశ్రీ, కలెక్టరేట్ ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం ఆలయం ముస్తాబు

రేపటి నుండి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు



ఆలయ ప్రాంగణంలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న కళాకారులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి శ్రీవారి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఆలయ గోపురాలకు రంగులు వేయించగా, ప్రాంగణంలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్నారు. అలాగే, ఆలయానికి లైట్లు అమర్చడంతో కొత్త వెలుగులు సంతరించుకున్నాయి. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజైన ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీవారికి పంచామృతంతో అభిషేకం, పంచాంగ శ్రవణం, వేప పూవు ప్రసాదం నివేదన, సాయంత్రం 5–04 పుష్కరిణి నుండి యాగశాలలోకి తీర్థపు బిందె తీసుకొస్తారు. ఇక 31న ధ్వజారోహణం, రుద్ర హోమం, వచ్చే నెల 1న సౌభాగ్యలక్ష్మి వ్రతం, 2న అష్టోత్తర కలశాభిషేకం, 3న స్వామి, అమ్మవార్లను అలంకరించి, ఎదుర్కోలు ఉత్సవం, 4న వకుళా మాత స్టేడియంలో కల్యాణ మహోత్సవం, అదే రోజు సాయంత్రం తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈమేరకు కల్యాణానికి ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తారు. ఇక 5న పుష్పయాగం, 6న శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం, 7న మహా పూర్ణాహుతి, శ్రీవారి చక్రస్నానంతో ఉత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాలకు ఏపీ, తెలంగాణ నుండి పెద్దసంఖ్యలో హాజరయ్యే భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ కె.జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.

ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వం తరఫున ఖమ్మంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో పాటు నాయకులు మహమ్మద్ ముస్తఫా, ఆశ్రిఫ్, చోటేబాబా, రషీద్, సాధు రమేష్‌రెడ్డి, ముజాహిద్ హుస్సేన్, ముక్తార్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న మంత్రి

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన మిషన్ భగీరథ ఎస్ఈ


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ఎస్ఈ శేఖర్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: మిషన్ భగీరథ ఉమ్మడి జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గడ్డం శేఖర్‌రెడ్డి శుక్రవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న వేసవిలో నీటి ఎద్దడి ఎదురుకాకుండా తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఈఈ పుష్పలత పాల్గొన్నారు.

3నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కూసుమంచి: రానున్న శ్రీరామనవమి పండుగ సందర్భంగా కూసుమంచి మండలంలోని జీళ్ల చెరువు లో ఏప్రిల్ 3నుంచి 5వ తేదీ వరకు పొంగులేటి యువసేన ఆధ్వర్యాన తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల కరపత్రాలను కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కార్యాలయ ఇన్‌చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి విడుదల చేశారు. ఈకార్యక్రమంలో రామాలయ చైర్మన్ ముద్రబోయిన నాగలక్ష్మి, మార్కెట్ డైరెక్టర్ మెక్కా ఉపేందర్‌తో పాటు మాదాసు ఉపేందర్, చాట్ల పరశురాం, అయితగాని నాగేశ్వరరావు, రంగయ్య, రాంగోపాల్, లక్ష్మయ్య, రవి, శ్రీను, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్


ఫరీద్ మస్తాన్

కొణిజర్ల: కొణిజర్ల మండలం విజయ ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం అధ్యాపకుడు పెంటేల ఫరీద్ మస్తాన్ (బాబా)కు ద్రవిడియన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ గోపీ పర్యవేక్షణలో ఆయన 'ఇంపాక్ట్ ఆఫ్ టెక్నాలజీ ఆన్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇన్ ది సెలెక్టెడ్ బ్యాంక్స్ ఇన్ తెలంగాణ స్టేట్' అంశంపై సమర్పించిన పరిశోధనా గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఫరీద్ బాబాను శుక్రవారం కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషా తరుణమ్, అధ్యాపకులు అభినందించారు.

సపోర్ట్ ఇంజనీర్ పోస్టులకు దరఖాస్తులు

ఖమ్మంవైద్యవిభాగం: జాతీయ ఆరోగ్య మిషన్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన మూడు సపోర్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్ఓ కళావతిబాయి తెలిపారు. బీటెక్, ఎంబీఏ పూర్తిచేసి, నాలుగేళ్ల అనుభవం కలిగిన జోన్ -4లోని బీసీ-ఏ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అలాగే, ఒక సైకియాట్రిస్ట్ పోస్టు కూడా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పోస్టుకు మల్టీ జోన్-1 పరిధి వారై 18నుంచి 44 ఏళ్ల వయస్సు కలిగి సైకియాట్రీ ఎండీ, తత్సమానమైన డిగ్రీ పూర్తి చేసి రెండేళ్ల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 2నుంచి 4వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో పూర్తి చేసి, విద్యార్హతలు, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్‌లు జత చేసి తమ కార్యాలయంలో అందించాలని డీఎంహెచ్ఓ సూచించారు.

నీలాద్రి ఆలయ ఈఓగా రజనీకుమారి


రజనీకుమారి

పెనుబల్లి: పెనుబల్లి మండలం నీలాద్రీశ్వర స్వామి ఆలయ ఈఓగా రజనీకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈఓగా ఉన్న పాకాల వెంకటరమణను అన్నపురెడ్డిపల్లి ఆలయానికి బదిలీ చేశారు. దీంతో పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయ ఈఓగా ఉన్న రజనీకుమారికి నీలాద్రి ఆలయ పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆమె విధుల్లో చేరారు. కాగా, గతంలోనూ ఆమె పదేళ్ల పాటు నీలాద్రి ఆలయ ఈఓగా బాధ్యతలు నిర్వర్తించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,250	5,800
అలసంద	5,800	5.800
మిర్చి	13,550	6,000
మిర్చి తాలు	5,500	4,200
పత్తి	7,100	5,500

- ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,871

ముహూర్తం ఖరారు

- రేపు కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన
- హాజరుకానున్న మంత్రి తుమ్మల
- ఉమ్మడి జిల్లాలో మూడో ఫ్యాక్టరీతో రైతులకు మేలు


కల్లురుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ ప్రతిపాదిత స్థలంలో చదును చేస్తున్న దృశ్యం

వేంసూరు: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడో పామాయిల్ ఫ్యాక్టరీకి ఏర్పాటుకు ముహూర్తం ఖరారైంది. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో గత ప్రభుత్వ హయాంలో ఫ్యాక్టరీ కోసం 42ఎకరాల స్థలం సేకరించగా.. ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యాన మూడేళ్ల క్రితం ఫెన్సింగ్ కూడా ఏర్పాటుచేశారు. కానీ రకరకాల కారణాలతో ఫ్యాక్టరీ ఏర్పాటులో జాప్యం జరిగింది. ఆపై కాంగ్రెస్ అధికారంలోకి రావడం, వ్యవసాయ శాఖ మంత్రిగా తుమ్మల బాధ్యతలు స్వీకరించడంతో ప్రత్యేక దృష్టి సారించారు. ఈనేపథ్యాన ఉగాది సందర్భంగా ఆదివారం ఫ్యాక్టరీ నిర్మాణానికి ఆయనతో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి చేతుల మీదుగా శంకుస్థాపనకు నిర్ణయించారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం ముహూర్తాన్ని నిర్ణయించారు.

రూ.70కోట్ల వ్యయంతో...

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రెండు పామాయిల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. అశ్వారావుపేటలోని ఫ్యాక్టరీ 30 టన్నులు, అప్పారావుపేటలో 90 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో కొనసాగుతున్నాయి. అయితే, ఉమ్మడి జిల్లాలో ఏటేటా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతుండడం.. సత్తుపల్లి నియోజకవర్గంలో ఇది ఎక్కువగా ఉండడంతో ఈ నియోజకవర్గంలో ఇంకో ఫ్యాక్టరీ ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందుకోసం వేంసూరు మండలం కల్లూరుగూడెంలో మూడేళ్ల క్రితం 42 ఎకరాల భూమి సేకరించగా.. అక్కడ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈమేరకు రూ.70 కోట్లు వెచ్చించనుండగా, ఇందులో రూ.52కోట్లు యంత్రాలకు, రూ.18 కోట్లు నిర్మాణాలకు కేటాయిస్తారు. ఈ ఫ్యాక్టరీలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు ఏర్పాటుచేస్తారని.. తద్వారా గంటకు 15 టన్నుల గెలలను క్రషింగ్ చేయొచ్చని చెబుతున్నారు.

వేగంగా రోడ్డు నిర్మాణ పనులు

కల్లురుగూడెం ప్రధాన రహదారి నుంచి ఫ్యాక్టరీ ప్రతిపాదిత స్థలం వరకు వరకు 60 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నారు. ఇందుకోసం ఐదుగురు రైతుల నుంచి 6.10 ఎకరాల భూమిని సేకరించిరూ.33లక్షల చొప్పున పరిహారం చెల్లించారు.

పెరిగిన ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం

వేంసూరు మండలంలో గతంలో దాదాపు 25వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉండేవి. కానీ వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, ఇతర కారణాలతో రైతులు మామిడి సాగుపై ఆసక్తి కోల్పోతున్నారు. ఇదే సమయాన ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించగా.. ప్రస్తుతం మండలంలో 6,550 ఎకరాల్లో 1,619 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఇక జిల్లాలో ఈ పంట సాగు వ్యాప్తంగా 35వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోంది.

జిల్లాలో వెయ్యికి పైగా ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతున్న మండలాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
సత్తుపల్లి	10,087.21
వేంసూరు	6,550
పెనుబల్లి	3,178.96
కొణిజర్ల	2,246.35
ఏన్కూరు	1,995.13
తిరుమలాయపాలెం	1,850.68
ఎర్రుపాలెం	1,550.23
కల్లూరు	1,351.42
ఖమ్మం రూరల్	1,059.02

మాకొద్దు ఈ పామాయిల్ ఫ్యాక్టరీ

కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించవద్దని పలువురు స్థానికులు శుక్రవారం సమావేశమై చేశారు. సామూహిక పట్టా భూమి 42 ఎకరాల్లో ఫ్యాక్టరీ నిర్మాణం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఇప్పటికే సివిల్ సప్లయీస్ గోదాంకు ఏడెకరాల భూమి ఇస్తే పురుగులతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఇప్పుడు సామూహిక పట్టా స్థలంలో ఫ్యాక్టరీ నిర్మిస్తే కాలుష్యం పెరగడమే కాక గ్రామ అవసరాలకు సెంటు భూమి కూడా ఉండదని తెలిపారు. ఈ విషయమై 2022లో హైకోర్టును ఆశ్రయించగా విచారణలో ఉందని, మానవ హక్కుల సంఘాన్ని సైతం ఆశ్రయించామని వెల్లడించారు.

అపోహలు నమ్మొద్దు

ఫ్యాక్టరీ నిర్మాణంతో కల్లూరుగూడెంలో కాలుష్యంగా పెరుగుతుందనే అపోహలను గ్రామస్తులు నమ్మవద్దని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ఓ ప్రకటనలో సూచించారు. మలేషియా, థాయిలాంగ్ ఇండోనేషియా తదితర దేశాల్లో అధ్యయనం చేశాక కాలుష్య రహితమైన అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే అదనపు నీటిని సైతం ఫిల్టర్ చేశాకే బయటకు వదులుతారని పేర్కొన్నారు. కాగా, ఫ్యాక్టరీ నిర్మాణంతో గ్రామంలోని 250మందికి ఉపాధి లభిస్తుందని, మండల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

చదువుతోనే ఉన్నత స్థానాలకు ఎదగొచ్చు...

'నవోదయ' వార్షికోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కూసుమంచి: ప్రస్తుత సమాజంలో చదువుకు ఎంతో ప్రాధాన్యత ఉందని.. వ్యక్తులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నా, సమాజానికి ఉపయోగపడాలన్నా చదువే కీలకంగా నిలుస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మండలంలోని పాలేరులో జవహర్ నవోదయ విద్యాలయ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించగా విద్యాలయ చైర్మన్ అయిన కలెక్టర్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మానవాళి జీవన ప్రమాణాలు పెరగాలన్నా, అస్థిత్వాన్ని కోల్పోకుండా ఉండాలన్నా చదువు తప్పని సరన్నారు. ప్రస్తుత తరానికి ప్రభుత్వాలు అనేక అవకాశాలు కల్పిస్తున్నందున శ్రద్ధగా చదువుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అలాగే, ఏ స్థాయికి చేరినా తల్లిదండ్రులు, గురువులను మరిచిపోవద్దని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. విద్యాలయ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, పేరెంట్, టీచర్స్ కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాతలు మీరే..

ఖమ్మం సహకారనగర్: అధ్యాపకులు కేవలం విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాక వారి వ్యక్తిత్వాన్ని మెరుగుపరిచి నవ సమాజ నిర్మాతలుగా నిలవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లాలో ఇటీవల జూనియర్ అధ్యాపకులుగా విధుల్లో చేరిన 58మంది కలెక్టర్‌ను శుక్రవారం కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమమైన అధ్యాపకులుగా రాణిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలిపారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు, సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం కోసమే సమ్మె


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా సమ్మెకు సిద్ధమవుతున్నట్లు ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు వెల్లడించారు. సంస్థ పరిధిలోని కార్మికుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం ఆలోచన చేయకపోవడం, హామీల అమలులోనూ విఫలమైందని ఆరోపించారు. ఈమేరకు జేఏసీ ఖమ్మం రీజియన్ కమిటీ సమావేశం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. అనంతరం జేఏసీ చైర్మన్ వెంకన్న మాట్లాడుతూ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతనాలు చెల్లిస్తామన్నా హామీ నెరవేరలేదన్నారు. అంతేకాక ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతూ సంస్థ ప్రైవేటీకరణకు యత్నిస్తున్నారని ఆరోపించారు. సీసీఎస్ బకాయిలు రూ.900 కోట్లు, పీఎఫ్ బకాయిలు రూ.1,250 కోట్లతో పాటు పెండింగ్ ఉన్న డీఏలను విడుదల చేయడమే కాక ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఏప్రిల్ 1న డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో కార్మికుల సమక్షంలోనే సమ్మె తేదీని ప్రకటిస్తామన్నారు. ఈసమావేశంలో జేఏసీ నాయకులు కే.ఎస్.పాల్, యాదయ్య, సుద్దాల సురేష్, పాటి అప్పారావు, నామ వీరభద్రం, పిల్లి రమేష్, జీ.ఎస్.రావు, యాదగిరి, జి.నారాయణ, ఎల్ఆర్‌కే.రావు, అరుణ, వై.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అభివృద్ధి పనులపై కార్యాచరణ


సమావేశంలో పాల్గొన్న రెండు జిల్లాల అధికారులు

ఖమ్మంవ్యవసాయం: రానున్న వానాకాలం, యాసంగి పంటల సీజన్లలో విద్యుత్ వినియోగం అంచనా, నిర్వహించాల్సిన పనులపై టీజీ ఎన్పీడీసీఎల్, ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఖమ్మంలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో రెండు సంస్థల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలస్థాయి అధికారుల సమన్వయ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రానున్న పంట సీజన్లలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన, మెరుగైన సరఫరా చేయడంపై చర్చించారు. 220/132 సబ్‌స్టేషన్లలో చేపట్టాల్సిన పనులు, అందుకు కావాల్సిన నిధులపై ప్రతిపాదనలు రూపొందించారు. వానాకాలం పంటల సీజన్ నాటికి నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు, ప్రస్తుతం జరుగుతున్న పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించాలని నిర్ణయించారు. అలాగే, విద్యుత్ వినియోగం ఆధారంగా అవసరమైన చోట్ల నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుపైనా చర్చించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ బి.శ్రీనివాస్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎన్పీడీసీఎల్ ఎస్ఈలు ఇనుగుర్తి శ్రీనివాసాచారి, జి.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాపై సూర్య ప్రతాపం

40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాపై నానాటికీ సూర్య ప్రతాపం పెరుగుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం వరకు 35-40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత ఉండగా గురువారం నుంచి పెరుగుతోంది. ఉదయం 9గంటలకే ఎండ మొదలై 11-30గంటలకల్లా తీవ్రమవుతోంది. మధ్యాహ్నం 12 నుంచి 3గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుండడంతో వీధులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. శుక్రవారం అత్యధికంగా ఖమ్మంలోని ఖానాపురం, ముదిగొండ మండలంలోని పమ్మిలో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే, మధిరలో 41.2, రఘునాథపాలెం, లింగాల, గేటు కారేపల్లి, బాణాపురంలో 41, మధిర, సిరిపురంలో 40.9, వైరా, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 40.8, సత్తుపల్లి, తిరుమలాయపాలెం 40.7, ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం, ఎర్రుపాలెం, కొణిజర్ల, పెదగోపతి, ఖమ్మం ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ వద్ద 40.5, పెనుబల్లి 40.5, ముదిగొండ, పంగిడిలో 40.3, చింతకాని, వేంసూరు, గుబ్బగుర్తిలో 40.1, తిమ్మారావుపేట, మంచుకొండ, సదాశివపేటలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.

వేమన శతకం.. ద్వాదశ పృచ్ఛక అవధానం


పృచ్ఛకుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న అఫ్రియా

ప్రతిభ చాటిన విద్యార్థిని మహ్మద్ అఫ్రియా

సత్తుపల్లిటౌన్: చదివేది ఏడో తరగతి.. తెలుగు మాతృభాష కూడా కాదు.. కానీ ఆ విద్యార్థిని వేమన శతకంపై ద్వాదశ పృచ్ఛక అవధానంలో సత్తా చాటింది. సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో రానున్న ఉగాదిని పురస్కరించుకుని గార్లపాటి, బొల్లేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన ఈ అవధానంలో డీఈఓ సోమశేఖరశర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వశాంతి పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని మహ్మద్ అఫ్రియా పాల్గొని వేమన శతకంపై 12 మంది పృచ్ఛకులతో నిర్వహించిన ద్వాదశ పృచ్ఛక అవధానంలో ప్రతిభ కనబరిచింది. డీఈఓతో పాటు కళాశాలకు చెందిన విద్యార్థులు, అతిథులు పృచ్ఛకులుగా శతకంపై వివిధ అంశాల్లో ప్రశ్నలు సంధించగా.. తడుముకోకుండా సమాధానాలు ఇచ్చింది. ఈ సందర్భంగా అఫ్రియాను సత్కరించారు. అలాగే, ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు వంశీ, పోతురాజు వేమన శతకంపై అవధానం చేస్తున్న విషయాన్ని డీఈఓకు వెల్లడించగా అభినందించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.మహేష్, బొల్లేపల్లి, గార్లపాటి ట్రస్ట్ నిర్వాహకులు బి.మధుసూదన్ రాజు, జి.రామకృష్ణ, ఎంఈఓలు నక్కా రాజేశ్వరరావు, సత్యనారాయణ, అధ్యాపకులు పూర్ణచంద్రరావు, మాధవి, బాలిక తల్లిదండ్రులు ఉస్మాన్, రాబియా, హెచ్ఎం యాకోబు, శేషగిరిరావు, మాలతి, ఆర్.శ్రీను పాల్గొన్నారు.

సాగర్ కాల్వలో మునిగి బాలుడు మృతి

ఈతకు వెళ్లిన సమయంలో ప్రమాదం


బత్తుల సాయి (ఫైల్)

కొణిజర్ల: సరదాగా ఈతకు వెళ్లిన బాలుడు సాగర్ కెనాల్‌లో మునిగి కన్నుమూశాడు. కొణిజర్ల ఎస్ఐ గుగులోత్ సూరజ్ తెలిపిన వివరాలు... మండలంలోని తనికెళ్లకు చెందిన బత్తుల కనకారావు కుమారుడు సాయి(15) స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఒక పూట బడికి వెళ్లొచ్చిన ఆయన మరో ఇద్దరు స్నేహితులతో కలిసి గ్రామ సమీపాన బోనకల్ బ్రాంచి కెనాల్‌లో ఈతకు వెళ్లాడు. అయితే, కాల్వలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో మునిగిపోగా, ఆయన స్నేహితులు వచ్చి కాలనీ వాసులకు తెలిపారు. దీంతో పోలీసులు, గజ ఈతగాళ్లు కాల్వలో గాలించగా సాయి మృతదేహం లభ్యమైంది. అయితే, సాయి మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆయన తండ్రి ఇచ్చిన ఫిర్యాదు చేయగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఒక్కగానొక్క కుమారుడి మృతితో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

ప్రభుత్వ పథకాలతో జీవనోపాధి పొందాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన నిరుద్యోగులు ప్రభుత్వ సంక్షేమ పథకాల జీవనోపాధి పొందాలని ఐటీడీఏ పీఓ బి రాహుల్ సూచించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ట్రైకార్ గ్రామీణ రవాణా పథకం కింద మంజూరైన వాహనాలను అబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. వాహనాలను ఖాళీగా ఉంచొద్దని, రవాణాకు వినియోగిస్తూ ఆదాయం పొందాలని చెప్పారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు కూడా ముందుకు రావాలని చెప్పారు.

సీఎం బసకు ఇబ్బందులు రావొద్దు

శ్రీరామనవమికి భద్రాచలం రానున్న సీఎం, ఇతర ప్రముఖులు హౌసింగ్ గెస్ట్ హౌస్, గిరిజన భవనాల్లో బస చేసే అవకాశం ఉందని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఆ రెండు భవనాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్‌లను ప్రారంభించి మాట్లాడారు. వీఐపీలకు అసౌకర్యం కలుగకుండా మైనర్ రిపేర్లను పూర్తి చేయాలని ఆదేశించారు. గెస్ట్‌హౌస్‌ను ముస్తాబు చేయాలని సూచించారు. అధికారులు డేవిడ్ రాజ్, రేణు, అశోక్ కుమార్, శ్రీనివాస్, రవి, జీవన్ కుమార్, దుర్గాప్రసాద్, రాజారాం, చలపతి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం చోరీ.. ఆపై అమ్మకం

180 బస్తాల రేషన్ బియ్యం చోరీ కేసులో నిందితుల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బియ్యంతో ఏసీపీ రఘు, సీఐ ముత్తిలింగం, ఎస్సై హరిత, సిబ్బంది

కల్లూరురూరల్: గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి ఎక్కువ ధరకు అమ్ముతుంటే వచ్చే డబ్బు సరిపోవడం లేదని, ఏకంగా బియ్యాన్ని చోరీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు కల్లూరులో శుక్రవారం ఏసీపీ ఏ.రఘు వివరాలు వెల్లడించారు. వైరా మండలం గోవిందపురానికి చెందిన ఓర్సు హన్మంతరావు, ఓర్సు కృష్ణ (దొర) కొన్నేళ్లుగా రేషన్ బియ్యాన్ని కొన్నాళ్లుగా అక్రమంగా కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. అయితే, ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించేందుకు బియ్యం చోరీ చేయాలని నిర్ణయించుకుని వైరా మండలం కలకొడిమకు చెందిన నల్ల బోతుల ఉదయ్, వెలిశాల చందు, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నెమలికి చెందిన అశోక్ లేలాండ్ డ్రైవర్లు గరిడేపల్లి జగదీష్, సాయితో జత కట్టారు. ఈమేరకు హన్మంతు, కృష్ణ చిన్నకోరుకొండిలోని రేషన్ షాపు చోరీకి అనువుగా ఉంటుందని గుర్తించారు. ఈసందర్భంగా ఉదయ్, చందు, జగదీష్‌లు దాచారం నుంచి కూలీలను రప్పించి 16న అర్ధరాత్రి షాప్ తాళాలు పగులగొట్టి 150 బస్తాల రేషన్ బియ్యం(90 క్వింటాళ్లు)ను రెండు వ్యాన్లలో తీసుకెళ్లారు. ఆపై కేజీ రూ.20 చొప్పున విక్రయించగా మిగిలిన 35 క్వింటాళ్ల బియ్యాన్ని కూరాకుల మురళి ఇంట్లో నిల్వ చేశారు. ఈ విషయమై అందిన సమాచారంతో శుక్రవారం నెమలిలో మురళి ఇంటి వద్ద ఆయనతో పాటు హన్మంతు, జగదీష్, ఉదయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా రూ.30వేల నగదు, అశోక్ లేలాండ్ వాహనం, 110 ఖాళీ సంచులను స్వాధీనం చేసుకుని ఓర్సు దొర, చందు, బియ్యం కొనుగోలు చేసిన ఖాతారెడ్డి, నర్సింహారావు కోసం గాలిస్తున్నామని ఏసీపీ తెలిపారు. కాగా, కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగయ్య, ఎస్సై హరిత, సిబ్బందికి ఏసీపీ రివార్డులు అందజేశారు.

ట్రాక్టర్ బోల్తా, పలువురికి గాయాలు


బోల్తా పడిన ట్రాక్టర్

ఏన్కూరు: మండలంలోని నెమలిపురి సమీపాన శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడగా పలువురు కూలీలకు గాయాలయ్యాయి. మిర్చి తోటల్లో పనికి మూలపోచారం నుండి నెమలిపురి వైపు మహిళా కూలీలు ట్రాక్టర్‌లో బయలుదేరారు. ఈక్రమాన వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో 20మంది కూలీలు గాయపడగా, వారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

బిహార్ కూలీ ఆత్మహత్య


రామ్‌కుమార్ (ఫైల్)

పెనుబల్లి: రైస్ మిల్లులో పనిచేస్తున్న కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని అడవిమల్లేలలో శ్రీసాయి లక్ష్మీశ్రీనివాస్ బాయిల్డ్ రైస్ మిల్లులో బిహార్‌కు చెందిన కూలీలు పనిచేస్తుండగా రామ్‌కుమార్(21) గురువారంనుంచి కానరాకపోవడంతో కోదాడలోని ఆయన అన్న వద్దకు వెళ్లి ఉంటాడని సహచరులు భావించారు. ఈమేరకు శుక్రవారం ఉదయం ఆయన సోదరుడికి ఫోన్ చేయగా తన వద్దకు రాలేదని చెప్పడంతో మిల్లు చుట్టుపక్కల వెతుకుతుండగా మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. ఈమేరక వీఎం బంజర్ ఎస్ఐ కె.వెంకటేష్ చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

వైన్స్ షాపులో చోరీ

కొణిజర్ల: కొణిజర్లలోని శ్రీ లక్ష్మీనరసింహా వైన్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం షాప్ తెరవడానికి వచ్చిన సిబ్బంది రేకులు తొలగించి ఉండడం, సమీపాన చేన్లలో మద్యం బాటిళ్లు కనిపించడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు వైన్ షాప్ యజమాని చేరుకుని ఎంత మేర స్టాక్ అయిందో సాయంత్రం వరకు లెక్కలు వేస్తున్నారు. అయితే, యజమాని నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ జి.సూరజ్ తెలిపారు.